క్లుప్తంగా

అవివేకంతోనే విమర్శలు


జమ్మికుంట: మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: విద్యార్థి దశలో ప్రజా సమస్యలు, తెలంగాణ సాధనలో ఉద్యమ నేతగా పోరాటం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు చేయడం అవివేకమని, నోరు అదుపులో పెట్టుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎగ్గెటి సదానందం, మాక్యమల్ల అశోక్ అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సాంబశివరెడ్డి, ఎగ్గెటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి ప్రజల దృష్టిలో బర్తరఫ్ అయిన ఎమ్మెల్యే

సైదాపూర్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటున్న హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గ ప్రజల దృష్టిలో ఎప్పుడో బర్తరఫ్ అయ్యాడని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి పొన్నంపై చేసిన విమర్శలను ఖండించారు. కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండి బీఆర్ఎస్‌కు కోవర్టుగా పని చేసినందుకు కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారని ఆరోపించారు.

హుజూరాబాద్: మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూర్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి పాడి కౌశిక్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవయవ దాన కుటుంబానికి సన్మానం


సన్మానిస్తున్న జీవన్‌దాన్ సిబ్బంది

శంకరపట్నం: మండల కేంద్రానికి చెందిన గాజుల నందన్ అనారోగ్యంతో హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. మృతుడి అవయవాలను తల్లిదండ్రులు శ్రీనివాస్‌-రమాదేవి దానం చేసేందుకు ముందుకొచ్చారు. హాస్పిటల్ యాజమాన్యం, ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ యాజమాన్యం వారిని సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వరద కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న రవిశంకర్

గంగాధర: వరద కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న రైతుల పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. వరద కాలువను ఆదివారం సందర్శించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నీళ్లతో కళకళలాడిన వరద కాలువ కాంగ్రెస్ పాలనలో ఎండిపోయి వెలవెలబోతోందని విమర్శించారు. రెండు రోజుల్లో వరద కాలువకు నీటిని విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఆందోళనలు, రాస్తారోకోలు తప్పవన్నారు.

కాలానుగుణంగా మార్పును స్వీకరించాలి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

చొప్పదండి: విద్యావ్యవస్థలో కాలానుగుణంగా మార్పులను విద్యార్థులు, తల్లిదండ్రులు స్వీకరించాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించగా.. హాజరై మాట్లాడారు. ఎంఈవో వేణుకుమార్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు వేదికలు బలోపేతం

- ఈనెలలో ఇప్పటికే రెండుసార్లు వీడియో కాన్ఫరెన్సులు


హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేటలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల బలోపేతానికి శ్రీకారం చుట్టింది. రైతుల అవసరాలకనుగుణంగా గత ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణం చేపట్టింది. రాష్ట్రంలో క్లస్టర్లవారీగా వీటి నిర్మాణం పూర్తి చేసుకొని రైతులకు అందుబాటులోకి వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా మరిన్ని కార్యక్రమాలు చేపడుతోంది. దీంట్లో భాగంగా రైతు నేస్తం కార్యక్రమం అమలు చేస్తోంది. రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు నిపుణుల సలహాలు అందించేలా ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హుజూరాబాద్ మండలంలో 19 గ్రామ పంచాయతీలుండగా.. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమంపై వ్యవసాయాధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

ఇవీ లాభాలు..

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారు. సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యలతోపాటు నూతన వంగడాలను రైతులకు వివరిస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులతో మాట్లాడడంతో అక్కడ పాటిస్తున్న విధానాలు తెలుసుకునే అవకాశముంటుంది. వీటితోపాటు పండించిన పంటలు నిల్వ చేసుకునే విధానం, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. సేంద్రియ సాగుతో కలిగే లాభాలతోపాటు భూసార పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారు. ప్రతి మంగళవారం రైతులకు అవసరమైన సలహాలు అందిస్తున్నారు. రైతులు పొలంలో నుంచే తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో నిపుణులతో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ లింకును రైతుల సెల్‌ఫోన్లకు పంపిస్తారు. దీంతో రైతులు ఎక్కడ ఉంటే అక్కడి నుంచే సమావేశంలో పాల్గొనే అవకాశముంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. రైతు వేదికకు రాలేని వారు మొబైల్ ఫోన్‌లోనూ మాట్లాడొచ్చు. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ముందుముందు అన్ని రైతు వేదికల్లో ఈ విధానం ప్రారంభమౌతుంది.

– చందుపట్ల సునీల్‌కుమార్, ఏవో, హుజూరాబాద్

అపూర్వ సమ్మేళనం

శంకరపట్నం: తాడికల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులందరూ ఒకదగ్గర చేరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చెక్‌డ్యామ్ నిర్మించాలని వినతి


పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును కలిసిన విలాసాగర్ గ్రామస్తులు

జమ్మికుంట: విలాసాగర్, ఓదెల మండలం రూపునారాయణపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై చెక్‌డ్యామ్‌ను పునర్నిర్మించాలని విలాసాగర్ గ్రామస్తులు కోరారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి సమస్యను విన్నవించారు. మానేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ ఇటీవల వర్షాలకు తెగిందని, మరమ్మతు చేసి పునర్నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాంగ్రెస్ మాజీ సర్పంచ్ రాచపల్లి సమ్మయ్య, రాచపల్లి సాగర్, రాచపల్లి శ్రీనివాస్, వార్డు మెంబర్ గరిగంటి శ్రీధర్, మోరె శివ, రాచపల్లికుమార్, సిరిసేటి శ్రీను, నెల్లి శ్రీను, వేల్పుల రాజయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ పి.ఇందిరాదేవి ఆదివారం తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేందుకు వివిధ రకాల పోటీలను యూనివర్సిటీ స్థాయి, రాష్ట్రస్థాయిలో నిర్వహించారు. రంగోళి పోటీల్లో హుజూరాబాద్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో శాతవాహన యూనివర్సిటీ తరఫున ప్రశంసాపత్రాలందుకున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాజీ ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

హుజూరాబాద్: కరీంనగర్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఆదివారం జిల్లాకేంద్రంలో ఎస్సీ ఉప కులాల సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సహాయ సహకారాలు అందించాలని వినతి పత్రంలో కోరగా.. తనవంతు బాధ్యతగా పోరాడతానని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిపాటి వేణు, జిల్లా అధ్యక్షుడు ఔషదం రవీందర్, ఉపాధ్యక్షుడు తల్వార్ పరమేశ్వర్, డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య ఉన్నారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్: కరీంనగర్ జిల్లా సుడా చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ఆదివారం తెలంగాణ దివ్యాంగ పట్టభద్రుల సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం సభ్యులకు తోడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం


హుజూరాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆదివారం లాబర్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 34, 35, 36 బూతుల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన బృహత్తర పథకాలను చూసి ఓటేసి మళ్లీ పట్టం కట్టాలన్నారు. పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, కౌన్సిలర్ నల్ల సుమన్, నాయకుడు పీఆర్ శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కొలిపాక వెంకటేశ్, రేపాక రాజు ఉన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ఎస్పీ బంగ్లా ఎదుట ఉన్న సీఎస్ఐ కైథిడల్ చర్చిలో క్రైస్తవులు మట్టల ఆదివారంను ఘనంగా జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారంను క్రైస్తవులు మట్టల ఆదివారంగా జరుపుకునే వేడుకల్లో రెవరెండ్ ఫాస్టరేట్ చైర్మన్ పాల్ కోమల్ దైవ సందేశం అందించారు. అనంతరం క్రైస్తవులు మట్టలు పట్టుకొని నగర పురవీధుల్లో సంకీర్తనలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ ప్రెస్బిడిటర్ మధుమోహన్, కార్యదర్శి సీహెచ్ దేవదాస్, కోశాధికారి నెల్సన్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

కామ దహనం


తిమ్మాపూర్‌లో..

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీహోమ్స్ కాలనీతోపాటు అల్గునూర్‌లో ఆదివారం రాత్రి కామ దహనం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.


అల్గునూర్‌లో..

వైభవంగా రథోత్సవం

ఆధ్యాత్మికం


వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

రామడుగు: వెలిచాల గ్రామంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రథోత్సవం వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం నుంచి రథోత్సవాన్ని దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన ప్రారంభించారు. దేవతామూర్తులతో గ్రామ ప్రధాన రహదారుల వెంట భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు.

లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో పుష్పయాగం


దేవనాథ రామానుజ జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న వీర్ల ప్రభాకర్‌రావు

వెలిచాల గ్రామ శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి పూజలు చేశారు. దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరెళ్ల శారదకు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు


వెదిర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శారదను సన్మానించిన కమిటీ సభ్యులు

రాష్ట్ర మహిళ కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారదఆంజనేయులుగౌడ్ నియామకమైన తర్వాత తొలిసారిగా స్వగ్రామం వెదిరకు రాగా.. ఆదివారం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీవేంకటేశ్వస్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, శ్రీభక్త మార్కండేయస్వామి దేవాలయం, శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేశారు. పూజారులు సాయి, మణి, వెంకటరమణ, అంజన్న పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు ఆధ్వర్యంలో సత్కరించారు. నాగుల రాజశేఖర్‌గౌడ్, రాల్లబండి పురుషోత్తంరెడ్డి, రాల్లబండి సంతోష్‌రెడ్డి, పూరెల రత్నాకర్, కోల రమేశ్, గోనేపల్లి బాలాగౌడ్, ద్యావ అనంతరెడ్డి, మాధవరెడ్డి, పంజాల శ్రీనివాస్‌గౌడ్, తడగొండ హన్మంతు, భైరగోని తిరుమల్‌గౌడ్, మారుతిగౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత పూజలు


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

వెదిర గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామివారి దేవాలయాల్లో ఆదివారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. దేవాలయం పూజారులు లొంకల వెంకటరమణ, అంజన్న, సాయి, మణి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. దేవాలయాల విశిష్టత గురించి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావును అడిగి తెలుసుకున్నారు. నరేందర్‌రెడ్డిని రాజేందర్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, రాల్లబండి పురుషోత్తంరెడ్డి, నాగుల రాజశేఖర్‌గౌడ్, తొరికొండ నారాయణ, దొడ్డ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న నిర్వాహకులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ హుండీని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం లెక్కించారు. అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్ అధ్యక్షతన హుండీ లెక్కించగా.. రూ.30,802 ఆదాయం లభించినట్లు తెలిపారు. శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ సొసైటీ పేరున బ్యాంకులో ఖాతా తీయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు వేంసాని రవీందర్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎలిగేటి రాములు, మునిగాల సుధాకర్‌గౌడ్, బొడిగె వెంకన్న, కోశాధికారి దండె సత్యానందం, పొరండ్ల భాస్కర్, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, గడ్డం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హుజూరాబాద్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకు ఐదు రోజుల ముందు జరుపుకునే పామ్ సండే(మట్టల ఆదివారం) పేరిట ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ సతీష్ దైవ సందేశాన్ని చదివి వినిపించారు. సొల్లు బాబు, ప్రియాంక శరణ్, వేముల రోహన్, గూడెపు రవీందర్, సురేఖ, సొల్లు మహేందర్, జయంతి, సవిత తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం





కరీంనగర్: నగరంలోని కుమార్వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–87లో పదోతరగతి చదువుతున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సిరి బ్యాంకెట్‌హాల్‌లో జరిగింది. పూర్వ విద్యార్థులందరూ వారితో కలిసి చదువుకున్న విద్యార్థినులతో కలిసి అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థినులను శాలువా, చీరతో సత్కరించారు. ప్రస్తుతం 52 సంవత్సరాల పైనే వయస్సు ఉన్న పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సందడిగా ఉత్సాహంగా గడిపారు.

కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్ టౌన్/విద్యానగర్: నగరంలోని మంకమ్మతోట ధన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000–01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం గోదాంగడ్డలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నెమరువేసుకున్నారు. తమ ఉపాధ్యాయులను సత్కరించారు. నిర్వాహకులు జిల్లెల కోటేశ్వర్, కత్తి మాధవి, కంతాల లలిత్ కుమార్‌రెడ్డి, శ్రీధర్, ప్రశాంత్,కుమార్,సంపూర్ణ, సుజాత రెడ్డి, కొలుగూరి కవిత తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



కరీంనగర్: తెలుగు అధ్యాపకుడు బలుగూరి మహేందర్‌రావు కుమారుడు హర్షవర్ధన్ జ్ఞాపకార్థం ఆదివారం నగరంలోని కేర్ నియో హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అనాథ పిల్లల ఆశ్రమానికి రూ.10వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో డీఐఈవో జగన్‌మోహన్‌రావు, ప్రిన్సిపాల్స్ రవీందర్ రెడ్డి, ఆంజనేయరావు, ఆంజనేయులు, సత్యనారాయణ, అధ్యాపకులు దేవేందర్, ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.